మందుల వల్ల మెదడులో గూడుకట్టుకున్న రక్తం కరిగి పోయింది. ఆరోగ్యం కొద్దిగా కుదుట పడటంతో కృత్రిమ శ్వాస పరికరాలను తీసేశారు. మరో రెండు వారాలు ప్రైవేట్ గదిలో ఉంచారు. ఇంత చేసినా నాన్నగారు బలహీనంగా తయార య్యారు. ఎప్పుడూ నిద్ర మత్తులో ఉండే వారు.

వారికి మొదటినుంచీ వైద్యం చేస్తున్న డ్యాక్టర్ రావ్ నాన్నగారి పరిస్థితి చూసి రక్త పరీక్ష చేయించ మన్నారు. పరీక్షలో హిమోగ్లోబిన్ శాతం పడి పోయినట్లు తేలింది. వెంటనే తన అసిస్టెంట్‌ను పిలిచి 100 సి.సి.ల రక్తాన్ని ఎక్కించ వలసిందిగా ఆదేశించారు డ్యాక్టర్.



ఆ రోజు ఆగస్టు 24.

ఉదయం నుంచీ రక్తం ఎక్కించమని బతి మాలుతున్నా సాయం త్రం అయిదు వరకూ ఎవ్వరూ పట్టించుకోలేదు. అయిదున్నరకు రక్తం ఎక్కించటం ప్రారంభించారు. ఓ ఐదు నిముషాలు అసహనం గా నిలబడి డ్యూటీ డ్యాక్టర్ వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు.

''ఓ గంట ఉండండి డ్యాక్టర్. మీరు దగ్గర ఉంటే మాకు ధైర్యంగా ఉంటుందని'' కాళ్లు పట్టుకుని బతిమాలుకున్నాను.

''అంత అవసరం లేదమ్మా. అవసరం అను కుంటే మీరు చెప్పాలా? నాకు తెలియదా? ఏమీ పర్లేదు'' అంటూ ఆ డ్యాక్టర్ వెళ్లి పోయాడు. అతని డ్యూటీ టైం అయిపోయిందట - అందుకు.

రక్తం ఎక్కించడం ప్రారంభమైన పది నిముషాలకే నాన్నగారు శ్వాస ఆడటం లేదంటూ - చలితో వణకడం మొదలెట్టారు. నాకు కాళ్లూ చేతులూ ఆడలేదు. పరుగెత్తుకుంటూ వెళ్లి ఎమర్జెన్సీ డ్యూటీలో ఉన్న మరో డ్యాక్టర్ని పిలుచుకు వచ్చాను.

''రక్తం ఎక్కించే సమయంలో ఇటువంటి పరిస్థితి కలగడం సహజమేనమ్మా. ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదు'' అంటూ అతను ఓ నిముషం నాన్న బెడ్ దగ్గర నిలబడి వెళ్లి పోయాడు.

మరలా నాన్నగారు ఊపిరాడక తన్నుకోవడం చూసి, సహనం నశించి పెద్దగా అరిచాను. ''రక్తం ఎక్కించడం ఆపుతారా లేదా?'' అంటూ కేకలు పెట్టాను.

''మీరు మనుషులా, రాక్షసులా, నా గోడు పట్టించుకోరేం'' అంటూ చిందులు తొక్కాను.

నర్సు నా వైపు వింతగా - భయంగా చూసింది తప్ప ఆపలేదు.

ఇక లాభం లేదని - ఇందాకటి ఎమర్జెన్సీ డ్యాక్టర్ని భుజం దగ్గర పట్టుకుని లాక్కొచ్చినంత పని చేశాను. అతనేమనుకున్నాడో ఏమో రక్తం ఎక్కించడాన్ని ఆపేశాడు.

అప్పటికే సీసాలోని ముప్పావు రక్తం నాన్న శరీరంలోకి వెళ్లి పోయింది. నాన్నకు జ్వరం ప్రారంభమైంది. టెంపరేచర్ వేగంగా పెరుగుతోంది. అతనేదో అత్యవసర చికిత్స చేశాడు. అయినా జ్వరం తగ్గుముఖం పట్టలేదు.

ఆ రాత్రంతా నేనూ, అమ్మా జాగారం చేశాం. నాన్నగారి తలకు ఉడుకులాన్‌తో పాటు ఐస్ ముక్కలూ పెట్టాం. జ్వరం ఏ మాత్రం తగ్గలేదు. రాత్రంతా నాన్నగారు బాధతో మూలుగుతూనే ఉన్నారు.

మరుసటిరోజు ఆగస్టు 25.

ఉదయం ఎనిమిది గంటలకు డ్యూటీలో ఉన్న నర్సు నాన్నగారి రిపోర్ట్‌లను, మెడికల్ ఛార్ట్‌లను క్రమ పద్ధతిలో పెడుతోంది.

అప్పుడు తట్టింది నాకు-

నెల క్రితం నాన్నగారు హాస్పిటల్లో చేరినప్పుడు హిమోగ్లోబిన్ శాతం ఎంతుందో తెలుసుకోవాలని. అప్పుడు ఎంతుందో తెలిస్తే, ఇప్పుడు ఏ మేరకు పడిపోయిందో అర్థం అవుతుందన్న కుతూ హలం ... అంతే.

రిపోర్టులన్నీ దగ్గర పెట్టుకుని ఒకటొకటి చదవడం మొద లెట్టాను.

అందులో నాన్నగారి బ్లడ్ గ్రూప్‌ను తెలిపే రిపోర్ట్ ఉంది. దాని ప్రకారం నాన్నగారి రక్తం గ్రూపు- ఎ ప్లస్ వి.

నాకెందుకో అపశృతిలా అనిపించింది. ఏదో పొరపాటు జరి గింది.

ఘోరమైన పొరపాటు. భయపడుతూనే నాన్నగారి బెడ్ పక్కనే



ఇంకా పడివున్న సీసా వేపు చూశాను.

దానిమీద ఉన్న లేబిల్‌పై - బి ప్లస్ వి. అని రాసి ఉంది.

ఆసుపత్రి సిబ్బంది చేసిన క్షమించరాని తప్పేంటో నాకర్థ మైంది.

నాన్నగారు రక్తం ఎక్కించిన వెంటనే శ్వాస ఆడక, తీవ్రమైన జ్వరంతో ఎందుకు బాధ పడ్డారో నాకు స్పష్టమైంది. రక్తం ఎక్కించ డానికి ముందు రక్త పరీక్ష చేసిన రిపోర్ట్‌లో నాన్నగారి బ్లడ్ గ్రూప్ - బి ప్లస్ వి- అని ఉంది.

నెల క్రితం నాన్నగారు హాస్పిటల్లో చేరినప్పుడు చేసిన రిపోర్ట్‌లో - ఎ ప్లస్ వి - అని ఉంది.

వెంటనే డ్యూటీ డాక్టర్ దగ్గరకు పరుగెత్తి ఆ రిపోర్ట్‌లను చూపిం చాను. నిన్నంత బతిమాలినా వినకుండా తన డ్యూటీ టైం అయిపో యిందని వెళ్ళిపోయిన మహనీయుడాయనే. జరిగిన పొరపాటును గ్రహించిన అతను దిగ్భ్రాంతికి లోనయ్యాడు. నా ఎదురుగానే లాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న అమ్మాయిని పిలిచి చెడామడా తిట్టాడు. తప్పంతా ఆ అమ్మాయిదే అయినట్లు - తన బాధ్యతను గానీ - మిగతా డాక్టర్ల ప్రమేయంగానీ ఏమీ లేదన్నట్లు మాట్లాడాడు.

పదింటికి ఎప్పటి మాదిరే డాక్టర్ రావుగారు రౌండ్లకి వచ్చారు. వెంటనే ఆయన దృష్టికి జరిగిన ఘోరాన్ని తీసుకు వెళ్లాను. అది తెలియగానే ఆయన ఆసుపత్రి సిబ్బంది మీద విరుచుకు పడ్డారు. పొరపాటు ఎలా జరిగిందో, ఎవరి వల్ల జరిగిందో విచారణ జరపా ల్సిందిగా ఆదేశించారు.

దీనివల్ల ఏ రకమైన లాభమూ ఒనగూడదని తెలుసుకుని ఆసు పత్రి ప్రధానాధికారికి లిఖిత పూర్వకమైన ఫిర్యాదు చేశాను.

ఈ తప్పు చేసిన సిబ్బందిని కఠినంగా శిక్షించాలని ఆ ఉత్తరంలో కోరాను.

ప్రధానాధికారి వెంటనే ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి తప్పుడు గ్రూపు రక్తం ఎక్కించడానికి దారి తీసిన పరిస్థితులను వివరించారు. తప్పు జరిగిన విషయాన్ని అందరూ ఒప్పుకున్నారు.

నేను ఫాథాలజిస్ట్‌ని కలిసి తప్పుడు గ్రూపు రక్తం ఎక్కిస్తే కలిగే పరిణామా లేమిటని అడిగాను.

''రక్త కణాల శాతం పడిపోవచ్చమ్మా - జాండిస్ వచ్చే అవకాశం ఉంది. మూత్ర పిండాలు పని చేయకుండా ఆగిపోయే ప్రమాదం కూడా ఉందమ్మా'' అని హెచ్చరించారు.

అతను చెప్పినట్లుగానే నాన్నగారికి కిడ్నీ సమస్య మొదలైంది. రాత్రి ఎనిమిదింటికి సర్జికల్ ట్రాలీని పట్టుకున్న ఒకతను నాన్న గారున్న గదిలోకి ప్రవేశించాడు. నేను కంగారు పడ్డాను. డాక్టర్ రావు గారి సలహా మేరకే తను వచ్చినట్లు చెప్పాడు. నాన్నగారి రక్త ప్రసరణ శాతం ఎంతుందో తెలుసుకోడానికి సెంట్రల్ వీనస్ పంక్చర్ చేయ నున్నట్లు నాకు వివరించారు.

మరలా నాన్నగారు ఊపిరాడక కొట్టుకోవడం చూసి వారిని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కి తరలించమని పట్టుపట్టాను. నా వత్తిడికి తలవొగ్గి నాన్నగారిని అక్కడికి మార్చి తిరిగి ఆక్సిజన్ ఎక్కించారు.

నాకేం చేయాలో పాలుపోక డాక్టర్ రావుగారింటికి ఫోన్ చేసి వెంటనే రావాల్సిందిగా బతిమాలాను. కొద్ది సమయం గడిచాక ప్రముఖ మూత్ర కోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్‌ని పిలిపించారు. నాన్నగారి దేహంలో పేరుకుపోయిన ద్రవాన్ని బైటకు పంపించటానికి పెరిటోనియల్ డయాలిసిస్ ప్రక్రియ చేపట్టారు.

అదనంగా ఉన్న ద్రవం వల్ల నాన్నగారి గుండెల మీద వత్తిడి పెరిగి దాని ఎడమ భాగం పని చేయడం మానేసింది. ఈ కారణంతో ఆయన బి.పి. పడిపోయింది. డయాలిసిస్ ప్రక్రియ విఫలం అవ డంతో దాన్ని వదిలేశారు.

శరీరంలో పేరుకు పోయిన అనవసర ద్రవాన్ని విసర్జింప చేయ డానికి డ్యూరెటిక్ ఇంజక్షన్‌ను వాడవలసిందిగా సూచించి డాక్టర్ చంద్రశేఖర్ వెళ్ళిపోయాడు. ఆ ఇంజక్షన్ వాడాక నాన్నగారు కొంత ఊరట చెందారు.

మరునాడు ఆగస్టు 26.

డాక్టర్ రావు, డాక్టర్ చంద్రశేఖర్‌లు తిరిగి నాన్నగారికి పరీక్షలు జరిపి - కొద్దికొద్దిగా కోలుకుంటున్నట్లు చెప్పారు. ఏమీ పర్లేదని భరోసా ఇచ్చారు.

ఆ రోజంతా ఆయనకు పెద్ద ఎత్తున లాసిక్స్, మరికొన్ని ఇతర మందులు వాడుతూనే ఉన్నారు. నాన్నగారి గొంతులో పెట్టిన ఆక్సి జన్ పైపును ఇక అవసరం లేదని తొలగించారు. పేషెంట్ పరిస్థితి నిలకడగా ఉందని చెప్పగానే నా మనసు కుదుట పడింది. ఆ రాత్రి భోంచేసి యూనిట్ వెలుపల ఉన్న సోఫాపై నిద్ర పోయాను.

ఉదయం నాలుగ్గంట లప్పుడు వార్డు బాయ్ నన్ను లేపి డాక్టర్ గారు రమ్మంటున్నారని చెప్పాడు. ఏదో జరక్కూడనిది జరిగి ఉంటుందని భయపడుతూ పరుగెత్తాను.

నాన్నగారికి అవసాన దశ ఆసన్నమైందని వారి పరిస్థితి చూడ గానే నాకు అర్థమైంది. డ్యూటీ డాక్టర్, నర్సులు శత విధాలా ప్రయ త్నించారు. ఐదు గంటల యాభై నిముషాలకు ఆయన....

కన్ను...మూ...శా...రు....!!!''

నీలిమ కళ్లల్లో నీళ్లు....

వింటున్న అందరి గుండెలూ బరువెక్కాయి.

నీలిమ తను పడిన బాధల్నీ, కష్టాన్నీ, మానసిక క్షోభనీ పూస గుచ్చినట్లు చెప్పినందువల్ల - అందరికీ ఆ బాధ తామే అనుభవించిన అనుభూతి కలిగి - అక్కడి వాతావరణంలో విషాదం అలుము కుంది.

☆☆☆

ఆదివారం ఉదయం -

సమయం- పదకొండూ యాభై నిముషాలు.

ఆదర్శ నిలయం-

పేషెంట్లందరూ వెళ్లిపోయాక శ్రీవాణి ప్రకాష్‌తో అంది.

''మీరు అవసరమైతేనే మందు లిస్తారన్న విషయం మాకు తెలుసు డాక్టర్. కానీ ఇక్కడికొచ్చే పేషెంట్లలో ఎక్కువ మంది కూలినాలి చేసుకునే వారే. అందుకే మీరు మందు అవసరం ఉన్నా మందు లివ్వనివ్వరు.. ఇది ఫ్రీక్లినిక్ కాబట్టి అలా చేస్తారనీ పేషెంట్లు అందరూ అనుకొంటూ ఉంటారు.''

ప్రకాష్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

''మన దేశంలో ఉన్న దౌర్భాగ్యపు స్థితి ఇదే. దేశంలో మొత్తం తొమ్మిది వేల డ్రగ్ కంపెనీలు అరవై వేల రకాల మందుల్ని తయారు చేసి అమ్ముతున్నాయి.

**(సశేషం)**

కథ




# ఒక్క రోజు 'అది' లేకపోతే ....

-గుమ్మడి రవీంద్రనాథ్

కారుని ఇంటి ఆవరణలోకి పోనిచ్చి, పార్కింగ్ స్థలం వైపుకి మలుపు తిప్పుతూ చూశాను - కారు శబ్దం విని, గుమ్మం దాటి పోర్టికోలోకి పరిగెత్తుకుంటూ వస్తున్న సౌరభ్‌నీ, వసంత్‌నీ.